క్లుప్తంగా

గంగానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

గుండవరం(చేబ్రోలు): చేబ్రోలు మండలం గుండవరం గ్రామంలో గంగానమ్మతల్లి అమ్మవారికి భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగానమ్మతల్లి వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులు రెండు రోజుల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక రథంపై అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. విశేష కార్యక్రమాలు, అభిషేకాలు జరిగాయి. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రతిష్టా మహోత్సవం



మంచాల(చేబ్రోలు): చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో హనుమత్ లక్ష్మణ సమేత సీతారామచంద్రస్వామి వారి మందిర విగ్రహ ప్రతిష్టా మహోత్సవం బుధవారం జరుగుతుందని నిర్వహకులు తెలిపారు. దీనిలో భాగంగా ఐదు రోజుల పాటు వివిధ కార్యక్రమాలను పండితులు వైభవంగా జరుపుతున్నారు. బుధవారం జలాధివాసం, వివిధ హోమాలు నిర్వహించారు. 20వ తేదీ గురువారం ఉదయం పది గంటలకు హనుమత్ లక్ష్మణ సమేత సీతారామచంద్రస్వామి వారల ప్రతిష్టా మహోత్సవం జరగనున్నది. అనంతరం శాంతి కల్యాణం, అన్న సంతర్పణ కార్యక్రమం జరుగుతుందని భక్త బృందం తెలిపారు.

వైభవంగా ధాన్యలక్ష్మీ నారాయణుల కల్యాణం



పాత గుంటూరు: అరండల్ పేట అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయ 29వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ధాన్యలక్ష్మీ నారాయణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్ నిర్వహణలో అభిషేకాలు, కుంకుమ పూజలు, హారతి, మంత్రపుష్పం, లలిత సహస్రనామ పారాయణం చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

సంక్షేమం, అభివృద్ధిని వివరించండి

- సమష్టిగా కృషిచేద్దాం.. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేద్దాం
- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్
- బూత్ స్థాయి కార్యకర్తలకు దిశా నిర్దేశం



బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బలసాని కిరణ్‌కుమార్, చిత్రంలో నియోజకవర్గ పరిశీలకుడు అవుతు శ్రీనివాసరెడ్డి

గుంటూరు రూరల్: బూత్ స్థాయిలో ప్రతి కార్యకర్త జగనన్న ప్రజలకు చేసిన మేలు, సంక్షేమం అభివృద్ధిని ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి కరోనా సమయంలో ప్రపంచం అంతా లాక్‌డౌన్ ప్రకటించి ప్రజలను పట్టించుకునే పరిస్థితి లేనప్పుడు సైతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికి వలంటీర్‌ను పంపి వారికి రావాల్సిన సంక్షేమ పథకాలు ఏవిధంగా అందించారో గుర్తు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లవుతున్నా ఏ పార్టీ చేయని సంక్షేమం, అభివృద్ధి జగనన్న అధికారంలోకి వచ్చిన అనతి కాలంలో చేసి చూపారని తెలిపారు. చంద్రబాబు డబ్బాలు కొట్టుకుని 40 ఏళ్లలో ఏ మంచి పని ప్రజలకు చేశాడో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుది మునిగి పోయే పడవని అందుకే అన్ని పార్టీలను కట్టకట్టుకుని తనతోపాటు ముంచేందుకు సిద్ధమయ్యాడన్నారు. ప్రతి ఒక్కరం సమష్టిగా కృషిచేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సైనికుల్లా పనిచేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేశాడన్నారు. భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేసిన ఏకైక నాయకుడు మన జగనన్న అని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



బలసాని కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న హిమనీనగర్ కాలనీ యువకులు

హిమనీనగర్ యువకులతో సమావేశం..

గుంటూరు రూరల్: జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని, యువతకు ఉపాధి మార్గం చూపించిన ఏకైక నాయకుడు జగనన్న మాత్రమేనని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జేకేసీ కాలేజీ రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో 48వ డివిజన్ హిమనీనగర్‌కు చెందిన యువకులు అభ్యర్థి బలసాని కిరణ్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి నేటివరకు ఎన్నడూ చూడని రీతిలో యువతకు ప్రభుత్వ, ప్రైవేటు కొలువులు అందించిన ఘనత జగనన్నకే దక్కుతోందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా, ప్రతి గ్రామానికి పదిమందికి ప్రభుత్వ కొలువులు కల్పించిన ఏకైక నాయకుడు జగనన్న అని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ, అగ్రికల్చర్, అనుబంధ విభాగాల్లో లక్షలాది మందికి ఉపాధి చూపిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. కరోనా లాంటి విపత్కర సమయంలో సైతం సంక్షేమ పథకాలు ప్రజలకు అందించిన నాయకుడు జగనన్న అని చెప్పారు. యువకులంతా జగనన్న ద్వారానే అభివృద్ధి, ఉపాధి, సంక్షేమం సాధ్యమని జగనన్నకు మద్దతు తెలుపుతున్నారన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని గెలుపు తథ్యమంటూ యువకులు సన్మానించారు. రెడ్డిపాలెం నాయకులు, యువకులు, హిమనినగర్ యువకులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు

ఆర్వో, నగర కమిషనర్ కీర్తి చేకూరి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాజకీయ పార్టీల నాయకుల నుంచి అందిన ఫిర్యాదులను, అర్జీలను వెంటనే పరిష్కారించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఆర్‌ఓ కీర్తి చేకూరి ఆదేశించారు. మంగళవారం తన చాంబరులో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో పశ్చిమ నియోజకవర్గ ఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మీతో కలిసి ప్ర త్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఓటరు జాబితాపై ఓటర్లు, రాజకీయ పార్టీల ప్రతినిదుల నుంచి అందిన అర్జీలను, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కారించాలన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ నెల 11 నుంచి 18వ తేదీ రెండు నియోజకవర్గాల్లో ఫారం 6, 7, 8లు, షిఫ్టింగ్ దరఖాస్తులు 3,529 అందాయని తెలిపారు. వాటిని 2 రోజుల్లో పరిష్కారించాలని ఆదేశించినట్లు చెప్పారు. ఏఈఆర్‌ఓలు వెంకటలక్ష్మి, సునీల్, సూపరింటెండెంట్‌లు ప్రసాద్, పద్మ, సెక్టోరల్ అధికారి శ్రీధర్, పలు పార్టీల ప్రతినిధులు డిప్యూటీ తహసీలార్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే..కేసులు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తొలగించిన రాజకీయ పార్టీల పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు సరైన అనుమతులు లేకుండా తిరిగి ఏర్పాటు చేస్తే ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలీసు కేసులు నమోదు చేయాలని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అధికారులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో కోడ్ అమలుని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. కొన్ని ప్రాంతాల్లో తొలగించిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు సరైన అనుమతి లేకుండా కొందరు తిరిగి ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనిపై క్షేత్ర స్థాయి ఎంసీసీ అధికారులు నివేదిక ఇస్తున్నారని చెప్పారు. నగరంలో ఎక్కడైనా ఎంసీసీ ఉల్లం ఘనలను ప్రజలు గుర్తిస్తే నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కంప్లైంట్ సెల్‌కు లేదా 98499 08391 కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపితే చర్యలు తీసుకుంటామన్నారు.

ర్యాలీలు, ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

- ప్రైవేట్ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే పోస్టర్లు, జెండాలకూ అనుమతులు
- ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.శ్రీకర్



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్

ప్రత్తిపాడు: రాజకీయ పార్టీలు నిర్వహించే ప్రచారాలకు, ర్యాలీలకు ఖచ్చితంగా అనుమతులు తీసుకోవాల్సిందేనని ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజకీయపార్టీల నాయకులతో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఆర్వో మాట్లాడుతూ వాల్ రైటింగ్‌లకు ఎలాంటి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదన్నారు. ప్రైవేట్ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే ఫ్లాగ్‌లు, పోస్టర్లుకు సంబంధించి కచ్చితంగా సంబంధిత ఇంటి లేదా స్థల యజమాని డిక్లరేషన్ ఇవ్వవలసి ఉంటుందన్నారు. పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేసుకోదలచిన వారు కచ్చితంగా అనుమతులు పొందాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. నామినేషన్ల తేదీకి ముందు వరకు ఖర్చులను పార్టీ ఖాతాలో, ఆ తరువాత నుంచి జరిగే ఖర్చులను అభ్యర్థుల ఖాతాలో నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. ఆయా రాజకీయ పార్టీల నేతలు గమనించి కార్యకలాపాలను కొనసాగించాలన్నారు. అదేవిధంగా తాత్కాలిక పార్టీ కార్యకలాపాలు, ప్రచార రథాలకు, ఇతర ప్రచార వాహనాలకు కూడా అనుమతులు తీసుకోవాలని చెప్పారు. కోడ్ ఉల్లంఘనలు, ఇతరత్రా అంశాలపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో 24/7 పనిచేసే విధంగా ఫిర్యాదుల సెల్ ఏర్పాటు చేశామని, నేరుగా ఫిర్యాదుల సెల్‌కు కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చన్నారు. అలానే వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనడానికి వీల్లేదని తేల్చిచెప్పారు.

ఫారం–7లు అంగీకరించం..

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఫారం–7లు ఇకపై అంగీకరించబోమని ఆర్వో చెప్పారు. 16వ తేదీన నోటిఫికేషన్ జారీకి ముందు వరకు వచ్చిన అర్జీలను మాత్రమే పరిగణలోనికి తీసుకుంటామన్నారు. అదేవిధంగా నూతనంగా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునే వాటిపై ఎలాంటి పరిమితులు లేవని, ఫారం–6లు తీసుకుంటామన్నారు. కొత్తగా ఓటుకు దరఖాస్తు చేసుకునేవారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకూ ఒంటిపూట ప్రకటించరూ..

మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్, రాష్ట్ర జాయింట్ డైరెక్టర్‌కు వినతిపత్రం

ప్రత్తిపాడు: ఎండలు మండుతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా ఒంటిపూట బడులను అమలు చేయాలని కోరుతూ ఫోరమ్ ఫర్ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్– మినీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు టి.జ్యోతిరాణి కోరారు. ఈ మేరకు మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ వెట్రి సెల్వి, జేడీ మనోరంజనిలను కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఎండల నేపథ్యంలో కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాలంటే చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని, అందుచేత హాఫ్‌డేస్ ప్రకటించాలని కోరారు. మే నెల మొత్తం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు, మినీ సెంటరు వర్కర్లుకు వేసవి సెలవులు ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు, జీతాలు విడుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

బ్రాహ్మణ హితుడు సీఎం వైఎస్ జగన్

ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి



కామేశ్వరరావును సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ అప్పిరెడ్డి

పట్నంబజారు: బ్రాహ్మణ హితుడు రాష్ట్ర వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రభుత్వ విప్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. ఈ నెల 31న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం ఏర్పాట్లపై ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ పి.కామేశ్వరరావు, ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురపు శ్రీకాంత్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరరామశర్మ తదితరులతో చంద్రమౌళి నగర్‌లోని తన నివాసంలో ఆయన చర్చించారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.300 కోట్లు కేటాయించి బోలపేతం చేసినట్లు చెప్పారు. ధూపదీప నైవేద్యాలకు ప్రత్యేకంగా రూ.234 కోట్లు కేటాయించి ఆలయాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. బ్రాహ్మణ ఆత్మీయ సమావేశానికి అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ పి.కామేశ్వరరావును అప్పిరెడ్డి ఘనంగా సత్కరించారు.